# కన్నెచెర



ఆచంట శారదాదేవి

బస్సు కుదుపులేకుండా నెమ్మదిగా సాగి పోతోంది. చల్లటి గాలి వీస్తోంది కిటికీకి దగ్గరగా కూర్చున్నాను రోడ్డు పక్కనే చెట్లు, పంట కాలువా, పొలాలు సుందరంగా కనిపిస్తున్నాయి నా పక్క సీట్లోనే సుందరి కూర్చుంది అది చిన్న సూట్‌కేస్ ఒళ్ళో పెట్టుకుని నిద్రతో తూగుతోంది. ఒకసారి దానివేపు చూశాను. దాని ముఖం అమాయకంగా ఉంది. నాకు కడుపులో బాధ అనిపించింది. ఆరు నెలల్లో తారుమారైన దాని జీవితం తలుచుకుంటే గుండె చెరువైంది.


సుందరి మా పిన్నికూతురు. మా పిన్నికి ఒక్కత్తే కూతురు. దానికి తరువాత ఒక మగపిల్లవాడు వాడికి మనసు ఎదగలేదు. అమాయకుడు. చదువు రాలేదు మా బాబాయికి ఉద్యోగం ఏమీ లేదు బి ఏ, దాకా చదివాడు. కాని ఊరికేనే ఉన్నాడు పిత్రార్జితం కొంత ఆస్తి ఉంది. దానితోనే కాలక్షేపం చేస్తున్నాడు ఇద్దరే పిల్లలు కాబట్టి ఇబ్బంది లేకుండానే గడచిపోతోంది. సుందరి సన్నగా తెల్లగా బొమ్మలా ఉంటుంది. దాన్ని స్కూల్ ఫైనల్‌వరకు చదివించారు. తరువాత పెళ్ళి చెయ్యాలన్న ఉద్దేశంతో చదువు మాన్పించారు అప్పటినుంచి వరాన్వేషణ ప్రారంభమైంది. ఒక్కత్తే కూతురు కావటంతో కొంత ఆస్తి అమ్మైనా మంచి కట్నం ఇచ్చి మంచి సంబంధం తేవాలన్న ఉద్దేశంతో మంచి సంబంధాలే వెతికారు కాని ఒక్క సంబంధమూ సరిగా కుదరలేదు. అవతలివాళ్ళకు నచ్చితే వీళ్ళకు నచ్చదు వీళ్ళకు నచ్చితే అవతలివాళ్ళకు నచ్చదు. ఒక్కత్తే కూతురు కావడంతో చాల మంచి సంబంధం తేవాలన్న ఆశతో మా బాబాయి ఏ సంబంధానికి సులభంగా ఒప్పుకోలేదు. అలాగే రోజులు గడిచి పోయాయి. సంవత్సరాలు దాటి వెళ్ళాయి. సుందరి పదహారేళ్ళ వయస్సునుంచి ముప్ఫైఏళ్ళ వయస్సుకు పెరిగింది.

అప్పుడు మా బాబాయికి గాబరాపట్టుకుంది. ఎల్లాగైనా దీనికి పెళ్ళి చేయగలుగుతానా, దీనికి కన్నెచెర విడిపించగలనా అని దిగులు పట్టుకుంది. ఎటువంటి సంబంధము నచ్చనివాడు చివరకు ఏ సంబంధమైనా సరే, ఎవరైనాసరే అసలు పెళ్ళంటూ జరిగితే చాలు అన్న హీనస్థితికి దిగజారాడు. అటువంటి పరిస్థితిలో మా మేనత్త ఒక సంబంధం పట్టుకు వచ్చింది. పిల్లవాడికి దగ్గర దగ్గర నలభై ఏళ్ళున్నాయి. రెండవ పెళ్ళి. మొదటి భార్య చనిపోయింది. కాని పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. ఆస్తిపాస్తులేమీ లేవు. ఇదీ సంబంధం. ఇది మా బాబాయికి నచ్చింది. పిల్లకు ముప్పైఏళ్ళు. మొదటి పెళ్ళివాడు కుదరటం కష్టమే. రెండో పెళ్ళివాడైనా మంచి ఉద్యోగంలో ఉన్నాడు. మంచి సంబంధమే అనుకున్నాడు ఈ పెళ్ళివారు కూడా రెండో పెళ్ళి అయినా కట్నాలు కానుకలు బాగానే అడిగారు. పాతికవేలు కట్నం ఇమ్మన్నారు. పెళ్ళి ఘనంగా జరపమన్నారు. మా బాబాయి అన్నింటికి ఒప్పుకున్నాడు. ఆయనకు ఒక్క కూతురు గదా! ఘనంగానే చెయ్యాలని ఉంది. సగం ఆస్తి అమ్మాడు అడిగిన కట్నం ఇచ్చాడు. అవతల భార్య, అసమర్థుడైన కొడుకు ఉన్నారు అని కూడా ఆలోచించలేదు. ఈ పిల్ల పెళ్ళైతే చాలు అనుకున్నాడు పెళ్ళి ఘనంగా జరిపాడు. ఏభై వేల ఖర్చుతో అప్పులు మాత్రం లేకుండా బయటపడ్డాడు. సుందరికి కన్నెచెర వదిలింది.

పెళ్ళిలోనే అక్కడా అక్కడా గుసగుసలు బయలుదేరాయి. పెళ్ళికొడుక్కు ఉండవలసిన అవలక్షణాలన్నీ ఉన్నాయి. వచ్చే సంపాదన అంతా తాగుడుకు సరిపోతుంది మొదటి భార్య ఇతనితో వేగలేక బాధలుపడలేక ఆత్మహత్య చేసుకుంది. అప్పటినుంచి మళ్ళా ఇప్పటివరకు ఎవరూ పిల్లనిస్తామని ముందుకు రాలేదు. ఇన్నాళ్ళకి వీళ్ళు పాపం తెలియక గోతిలో దిగుతున్నారు. పెళ్ళికి వచ్చిన చుట్టాలు స్నేహితులు గుసగుసలు చాటుచాటుగా చెప్పుకున్నారు. ఇదంతా విన్న నేను బాధ భరించలేక ముహూర్తానికి ముందే పెళ్ళి మా బాబాయితో చెప్పాను. ఈ పెళ్ళి ఎలాగైనా ఆపుచెయ్యమని ఆయన వినిపించుకోలేదు "ఆ. కాని వాళ్ళు అసూయతో ఏదో అంటూనే ఉంటారు." అని తోసిపారేశారు. పెళ్ళి యథావిధిగా జరిగిపోయింది.

సుందరికి మొదటిరాత్రి శోభనపు గదిలోనే తెలిసిపోయింది. పెళ్ళికొడుకు తప్పతాగి వచ్చాడు అని. అయినా ఏం చేస్తుంది? అతను పెట్టే చిత్రవధ అనుభవించక తప్పలేదు పరాయి వెధవ తాగి వచ్చి తాకడానికి ప్రయత్నిస్తే తిట్టి పోస్తాము తన్ని తరిమేస్తాము. కాని ఏభైవేలు పోసి కొనుకున్న భర్త ఏం చెయ్యడానికి వీలులేదు తాళిగట్టిన భర్త తాగివచ్చినా కౌగిలించుకోక తప్పదు. మనసులో వెగటు మనసులోనే దాచుకుని.

కాపురానికి వెళ్ళిన రెండునెలల్లోనే సుందరికి మొదటిభార్య ఆత్మహత్య చేసుకున్నమాట నిజమే అయి ఉంటుందని, అందులో అసత్యమేమీ ఉండదని తెలిసి




పోయింది. రానురాను సుందరికి కాపరం నరకం అయింది. సంపాదన చాలక పుట్టింటినించి మళ్ళీ మళ్ళీ డబ్బు తీసుకు రమ్మన్న సాధింపులు బాధలు ఎక్కువైనాయి ఇవన్నీ తట్టుకోలేక ఒకరోజు మళ్ళా మా ఊరు చేరుకుంది. అతను మనిషి మారితేనేగాని మళ్ళా వెళ్ళనని కూచుంది. దాన్ని బలవంతంగా పంపటానికి ఎవరికీ మనసు రాలేదు. ఇది వచ్చేసిన తరువాత అతను మళ్లా దీని విషయం పట్టించుకోలేదు. ఉత్తరాలు లేవు. మనిషి రాలేదు.

దీని కాపురం ఇలా అయినందుకు మా బాబాయి మంచం పట్టాడు. ఈ పెళ్ళి కోసం ఉన్న ఆస్తి మూడువంతులు తరిగి పోయింది. కొడుకు సంపాయించలేడు. తనకు వయసు పెరుగుతోంది. ఈ దిగులుతో ఆయన మళ్ళా కోలుకునే సూచనలు కనిపించలేదు. మా పిన్ని, సుందరి కూడా కూడా దిగులుతో జీవచ్ఛవాలులా బ్రతుకుతున్నారు. సుందరికి మా బాబాయి తాపత్రయంవల్ల కన్నెచెర వదిలింది కాని బ్రతికి నన్నాళ్ళు భరించవలసిన మరొక చెర తగుల్కొంది పెళ్ళి కాకపోతే ఏమిః దాన్ని చదివించి ఉద్యోగంలో పెట్టి ఉండవచ్చును. సగం ఆస్తి ఇచ్చి ఉండవచ్చును. ఇప్పుడు ఈ పెళ్ళివలన ఏం సుఖపడుతోంది, అని ఎన్నో సార్లు అనిపిస్తుంది. కాని ఏం చేస్తాం! దానికి పెళ్ళి అయ్యేవరకు మా బాబాయికి మనశ్శాంతి లేదు ఇప్పుడు మరొక రకంగా మనశ్శాంతి లేదు.

బస్సు ఒక మూలగా ఆగింది. ఏవో బ్రేకులు బాగులేవట. డ్రైవరు కండక్టరు దిగి చూసుకుంటున్నారు. ప్రొద్దు వాలింది. చెట్లక్రింద నీడలు వ్యాపిస్తున్నాయి.

సుందరిని నాతో మద్రాసు తీసుకువెళ్తున్నాను అక్కడ దాన్ని మాంటిసోరి ట్రైనింగులో చేర్పించి తరువాత దాని కెక్కడైనా స్కూల్లో ఉద్యోగం సంపాదించిపెట్టాలని నా ఆలోచన. సంపాదన కోసం కాకపోయినా, దానికొక కాలక్షేపం ఉంటుందని.

"అక్కా, నాకు ఉద్యోగం దొరుకుతుందంటావా?" అంది సుందరి హఠాత్తుగా, నా ఆలోచనలను ఊహిస్తున్నట్లుగా!

"ఎందుకు దొరకదు? తప్పకుండా దొరుకు తుంది" అన్నాను నేను ధైర్యంగా.

సుందరి నిర్లిప్తంగా దిక్కులు చూస్తూ ఊరుకుంది. దాని కళ్ళలో దిగులు తాండవిస్తోంది. ఏదో అంతులేని అగాధం గూడు కట్టుకుంది.

సుందరికి నేను చాలా శ్రమపడి ఉద్యోగం సంపాదించి పెట్టగలనేమో! మరి మళ్ళా ఆ కళ్ళల్లోకి వికాసం ఎలా తేగలను? ఆమె శాశ్వతంగా చిక్కుకున్న చెరలోంచి ఎలా విడిపించగలను? ఆ కాపురం చేసిన రెండు నెలల్లోనే ఆమె భర్తమీద మమకారం పెంచుకుందేమో! ఆ గుండెల్లో వేదన ఎలా తొలగించగలను?

ఈ ప్రశ్నలకు సమాధానం తోచటం లేదు. సుందరి నిర్జీవ ప్రతిమలా ఉంది. ★


# అరుణా
# ఆంగ్ల భాషా స్వబోధిని

## అరువది రోజులలో ఆంగ్లభాషను అభ్యసించండి

తెలుగు తెలిసిన వయోజనులు, స్త్రీలు టీచరు సహాయము లేకుండానే ఇంటి వద్దనే వుండి ఇంగ్లీషు నేర్చుకోవడానికి, మా "అరుణా ఆంగ్ల భాషా స్వబోధిని" కల్పతరువు వంటిది. మీ స్నేహితులతో ఇంగ్లీషులో మాట్లాడుకోవడానికి, ఉత్తర ప్రత్యుత్తరములు జరుపుకోవడానికి, ఇంకెన్నో మీకు కావలసిన విషయాల్ని గురించి ఇందులో బొమ్మలతో సహా చక్కని తేలికైన ఉదాహరణలు వున్నాయి. మీ ఆంగ్ల భాషా విజ్ఞానము నిర్దుష్టంగాను, ధారాళంగాను వుండేందుకు వీలుగా పూర్తి గ్రాపురు పొందుపరుచబడివుంది. హైస్కూలు విద్యార్థులకు కూడా ఇది మిక్కిలి ఉపయోగకరమైనది.

త్రివర్ణ ముఖచిత్రముగల జాకెట్‌తో—క్యాలికో బైండు—దాదాపు 700 పేజీలు.

**వెల: రూ. 10-00. పోస్టేజి రూ. 2-75. నేడే మీ కాపీకి M. O. చేయండి.**

**SREE ARUNA BOOK HOUSE (J)**
**1/48, Narayana Mudali St., MADRAS-1**